కథ

# మార్పు

హోతా పద్మినీదేవి

"విషి ఫోన్ చేశాడా?" వడ్డన పూర్తి చేసి నేతి గిన్నెతో వచ్చిన కోడలిని అడిగారు విశ్వనాథంగారు.

తులసి భర్తవైపు చూసింది. సూర్యనారాయణ అదే సమయంలో భార్య వైపు చూశాడు.

"చేశాడు నాన్నా!" అస్పష్టంగా గొణిగినట్టు అన్నాడాయన.

"వాడు హైదరాబాద్ వెళ్లి మూడు రోజులయింది. మంగళవారం ప్రొద్దుటకి వస్తానన్నాడు. రాలేదు. అక్కడ ఏం చేస్తున్నట్టు?" ఎనభై ఏళ్ల విశ్వనాథంగారి స్వరం ఆ గదిలో ఖంగుమంది.

"వాళ్లత్తగారికి జ్వరంగా ఉందిట" నసిగాడు సూర్యనారాయణ.

"అయితే ఏమిటి? వీడు ఆవిడ కాళ్లు పడుతున్నాడా?" వ్యంగ్యంగా అడిగాడు విశ్వనాథం.

తులసి మౌనంగా నెయ్యి వడ్డించింది.

"అల్లుడు అత్తవారింటికి ఏడాదికోసారి వెళ్తేనే గౌరవం. ఇలా నెలకోసారి వెళ్తే ఎంత లోకువ?" మునలాయన అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

సూర్యనారాయణకి ముద్ద దిగడం లేదు. "పోనీ వెళ్తే వెళ్లాడు. చుట్టం చూపుగా చూసి రాక ఏకంగా మూడు రోజులుండిపోయాడు. గౌరవంగా చూస్తారా వాళ్లు వీడిని?" విశ్వనాథం అన్నం తింటున్నంతసేపూ సాధింపుగా ఏదో ఒకటి అంటూనే ఉన్నాడు.

తులసికి మామగారి సాధింపు కొత్త కాదు. ఆయనేమన్నా భర్త ఎదురుచెప్పకపోవడం కూడా తెలుసు. అది సూర్యనారాయణకి తండ్రి పట్ల ఉన్న గౌరవమో, భయమో ఆమెకి ఈనాటికీ అర్థం కాదు.

భోజనమై మామగారు ఆయన గదిలోకి వెళ్లే దాకా ఆగి తులసి తమ బెడ్‌రూమ్‌లోకి వచ్చి భర్త సెల్ ఫోనులోంచి కొడుక్కి ఫోన్‌చేసింది.

"విషీ! మీ అత్తగారెలా ఉన్నారు?"

"జ్వరం తగ్గిందమ్మా! ఇంకా అన్నం తినడం లేదు. లిక్విడ్ డైట్ మీదే ఉన్నారు"

"కల్పన ఎలా ఉంది?"

"తనకి ఏం తిన్నా వాంతులవుతున్నాయి"

"నెల తప్పిన కొత్తల్లో అలాగే ఉంటుంది. జ్యూస్‌లవీ ఎక్కువ తీసుకోమను"

"అలాగేనమ్మా! నేను రేపు బయలుదేరి వస్తున్నాను. లీవ్ కూడా అయిపోవచ్చింది"

"సెలవు పొడిగించడానికి ఉండదా?"

"లేదమ్మా! అయినా మా మామగారు వంటమనిషిని మాట్లాడారు. ఆవిడ రేపటి నుంచి వస్తుంది. అత్తయ్యగారిని హాస్పిటల్ నుంచి నిన్న డిశ్చార్జి చేశారుగా? ఇంక వాళ్ల తంటాలేవో వాళ్లు పడతారులే"

"సరే! కల్పనని అడిగానని చెప్పు" అందావిడ.

"సరే!" అతను ఫోన్ పెట్టేశాడు.

"ఏమంటాడు?" సూర్యనారాయణ అడిగాడు. ఆవిడ చెప్పింది.

"పాపం! విషి వాళ్లకి ఇంకో రెండు రోజులయినా సాయం ఉంటే బాగుండేది" అన్నాడాయన.

"నిజమే కానీ వాడికి సెలవులేదుట"

"వెళ్లి భోజనం చెయ్యి ఇప్పటికే ఆలస్యమైపోయింది"


తులసి డైనింగ్ టేబిల్ దగ్గరకొచ్చింది. అన్నం వడ్డించుకుందే గానీ తినబుద్ధి కావడం లేదు. ఆమెకి గతం గుర్తొస్తోంది.

☆ ☆ ☆

సూర్యనారాయణతో పెళ్లయ్యేసరికి ఆమెకి పద్ధెనిమిదేళ్లు. పెళ్లితో బాధ్యతలు మొదలవుతాయని తెలియని వయసు. అందగాడు. మెత్తటి మనసు ఉన్న సూర్యనారాయణతో జీవితాన్ని పంచుకున్న ఆమెకి ప్రతీ క్షణం అమూల్యంగానే కాదు అద్భుతంగా కూడా తోస్తోంది.

పుట్టింట్లో తల్లిదండ్రుల చాటున పెరిగిన ఆమెకి అత్తింట్లో అత్తమామల చాటున కాపురం పెద్ద కష్టమనిపించలేదు.

స్వతహాగా మెత్తటి మనసు ఆమెది. దానికి తోడు



భయస్తురాలు. ఒద్దికగా వినయంగా ఉండే ఆమెని అత్తగారు కామేశ్వరమ్మ కన్నకూతురి కంటే ఎక్కువగా చూసుకునేది. అయినా ఆమెలో ఏదో అసంతృప్తి. ఆ అసంతృప్తికి కారణం విశ్వనాథంగారు.

కాపురానికి వచ్చిన కొత్తలోనే ఆ ఇంట్లో వాళ్లకి మామగారి మాట జవదాటే ధైర్యం లేదని గ్రహించింది. ముఖ్యంగా పాతికేళ్ల సూర్యనారాయణ తండ్రి కనుసన్నలలో నడవడం, దానితో తను ఆ ఇంట్లో చిన్న చిన్న ఆనందాలని కోల్పోవడం ఆమెకి అసంతృప్తిని కలిగించింది.

పెద్దవాళ్ల మాటని గౌరవించడం వేరు వాళ్లకి భయపడ్డం వేరు. భర్త చిన్న చిన్న విషయాలకి కూడా తండ్రిని సంప్రదించడం, విశ్వనాథంగారు ప్రతీ విషయంలోను జోక్యం చేసుకోవడం చూస్తే విచిత్రంగా అనిపించేదామెకి.

ఆమె పెళ్లయిన రెండు నెలలకి సంక్రాంతి పండుగకి వియ్యాలవారిని తమ ఇంటికి ఆహ్వానించడానికి ఆమె తండ్రి రామనాథం వచ్చాడు.

తండ్రితో ముక్తసరిగా మాట్లాడుతున్న మామగారిని గమనిస్తోంది తులసి. తన పెళ్లప్పుడు కట్నకానుకల దగ్గర కానీ, పెట్టుపోతల దగ్గర కానీ పేచీలు లేవు. మరి మామగారు మనసులో ఏం పెట్టుకుని తండ్రితో ముభావంగా మాట్లాడుతున్నాడో ఆమె ఊహకి అందలేదు.

"కులాసాగా ఉన్నారా అన్నయ్యగారూ?" అని అత్తగారు నోరారా పలుకరించి మర్యాద చేయడం మండుతున్న ఆమె మనసుకి చందనపు పూతలా అనిపించింది.

"సంక్రాంతి పండుగ మూడు రోజులు మీరు మా ఇంట్లోనే ఉండాలి. మీరు మేము కలిసి పండుగ జరుపుకోవాలి" అని మర్యాదగా ఆహ్వానించాడు వియ్యంకుడిని రామనాథం.

"అబ్బే మేమంతా ఎందుకండీ? మీ అమ్మాయి, అల్లుడు వస్తారు. కావాలంటే మీ అమ్మాయి నాలుగు రోజుల ముందే వస్తుంది" అన్నాడు విశ్వనాథం.

తండ్రి ఎన్నిసార్లు ప్రాధేయపూర్వకంగా పండక్కి రమ్మని పిలిచినా మామగారు తిరస్కరించడం చూసిన తులసికి భయం వేసింది. అల్లుడు వచ్చేదాకా ఉండి పండక్కి పిలుద్దామనుకున్న రామనాథం ఆశ తీరలేదు.

"నన్ను పిలిస్తే వాడిని పిలిచినట్టే. అంతగా పిలవాలనుకుంటే ఫోన్‌లో పిలవండి" అన్నాడు విశ్వనాథం అన్యాపదేశంగా ఆయన్ని 'మీరిక బయలుదేరండి' అని చెబుతూ.

రామనాథం చేసేది లేక కూతురితో వియ్యపురాలితో చెప్పి బయలుదేరాడు.

తండ్రి పట్ల మామగారి వైఖరికి తులసి మనసు గాయపడింది.

ఆ సాయంకాలం ప్రతీరోజులాగే సూర్యనారాయణ ఆఫీసు నుంచి ఇంటికొచ్చి తండ్రి దగ్గర కూర్చున్నాడు. అతను గదిలోకి వస్తే బాగుండును తండ్రి తమని పండుగకి పిలిచాడనే చెప్పాలని తులసి ఉవ్విళ్లూరుతోంది. పండుగ మూడు రోజులూ భర్తతో తన పుట్టింట్లో గడపబోతోందనే ఊహ ఆమెని ఉత్తేజితురాలిని చేస్తోంది.

"కాముడూ! అబ్బాయొచ్చాడు. కాఫీ పంపించు" బిగ్గరగా పిలిచి చెప్పాడు విశ్వనాథం.

వంటింట్లో ఉన్న కామేశ్వరమ్మ కాఫీ కలిపి కోడలిని తీసుకెళ్లమంది.

తులసి కాఫీగ్లాసుతో హాలులోకి వచ్చేప్పటికి విశ్వనాథంగారు కొడుకుతో చెబుతున్నాడు.

"మీ మామగారు సంక్రాంతికి నిన్ను వాళ్ల ఇంటికి ఆహ్వానించారు"

"ఆహా!" అన్నాడు సూర్యనారాయణ చాలా మామూలుగా.

"భోగి రోజు ఉదయమే నువ్వు, అమ్మాయి రాజమండ్రి వెళ్లండి. తులసి పండుగ నాలుగు రోజులు అక్కడుంటుంది. నువ్వు మాత్రం సాయంకాలానికి ఇక్కడకొచ్చెయ్యి"

"అలాగే నాన్నగారూ!" అన్నాడతను. తులసి కాఫీ గ్లాసు అతనికిచ్చి లోపలకి వచ్చేసింది. భర్త పండుగ మూడు రోజులు తమ ఇంట్లో ఉంటాడని అతనికి గోదావరి అందాలను, కడియపులంకలో నర్సరీలో పూబాలల సోయగాలని చూపించాలని తన స్నేహితురాళ్లందర్నీ అతనికి పరిచయం చెయ్యాలని ఎంతో ఆశపడిన ఆమెకి మామగారి శాసనం లాంటి ఆదేశానికి భర్త మారు మాట్లాడకుండా అంగీకరించడంతో ఆశాభంగంతో, కన్నీళ్లొచ్చాయి.

సూర్యనారాయణ ఆఫీసు విశేషాలని తండ్రికి చెప్పి తీరుబడిగా లోపలకి వచ్చాడు. షర్టు విప్పుకుంటూ మంచం మీద తలదించుకుని కూర్చుని ఉన్న తులసిని అడిగాడు.

"మీ నాన్నగారు వచ్చి వెళ్లారుట"

తులసి సమాధానమివ్వలేదు. ఆమె చుబుకం పట్టి ఆమె ముఖాన్ని పైకెత్తిన అతను ఆమె కన్నీళ్లు చూసి ఆదుర్దాగా అడిగాడు.

"ఎందుకేడుస్తున్నావ్?"

"పండుగ మూడు రోజులూ మీరు మా ఇంట్లో సరదాగా గడుపుతారనుకున్నాను. కానీ మీ నాన్నగారు మిమ్మల్ని ఒక్క పూట మా ఇంట్లో ఉండి వచ్చెయ్యమంటున్నారు. కారణం ఏమిటి?" జాలిగా



## పాపం శ్రియ

శ్రియ నటించిన హాలీవుడ్ సినిమా 'ది అదర్ ఎండ్ ఆఫ్ ది లైన్' పరాజయం పాలైంది. దీంతో డీలా పడిపోయింది శ్రియ. ఈ సినిమా గురించి ఎన్నో తెలుగు, తమిళ సినిమా ఆఫర్లను కాదని వదులుకున్నందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతోంది శ్రియ అని ఆమె సన్నిహితులు చెప్పుకుంటున్నారు. ఎంత ఇంగ్లీషు సినిమాల్లో అవకాశాలు వస్తే మాత్రం తనకి గుర్తింపు తెచ్చిన రంగాల్ని నిర్లక్ష్యం చేస్తే ఇలాగే వుంటుంది మరి! అంటున్నారు సినీ పండితులు.

అడిగింది.

"మా నాన్నగారు చెప్పిన మాట వినడం తప్ప ఎందుకని ఎప్పుడూ ఆయన్ని ఎదురుప్రశ్నించలేదు" గంభీరంగా అన్నాడు.

ఆ సమాధానంతో తులసి నిరుత్తరురాలయింది. ఆమె పరిస్థితిలో మరొకరు ఉంటే అలిగి భర్తని సాధించి అతన్ని తన మాట వినేలా చేసుకునేదేమో. కానీ ఆమె స్వభావం అలాంటిది కాదు.

మనసుని సమాధానపరచుకోలేకపోయిన తులసికి కన్నీళ్లొస్తూనే ఉన్నాయి.

"మీ మామగారు అదో రకం మనిషమ్మా! నలభై ఏళ్ల కాపురంలో ఆయన్ని కొంచెం కూడా మార్చలేకపోయాను" అంది కోడలి కన్నీళ్లని చూసి కామేశ్వరమ్మ నిస్సహాయమైన బాధతో.

తండ్రి మాట జవదాటకుండా సూర్యనారాయణ భోగిపండుగ రోజు సాయంకాలానికి భీమవరం వెళ్లిపోయాడు. తులసి కూడా భర్తతో కలిసి వెళ్లిపోదామనుకుంది. కానీ అల్లుడు ఉండనందుకే బాధపడుతున్న తల్లిదండ్రులు తను కూడా వెళ్లిపోతే మరింత బాధపడతారని ఉండిపోయింది.

☆ ☆ ☆

ఆషాఢమాసం వచ్చింది.

అత్తగారు కొత్తకోడలు ఒకే ఇంట్లో ఉండకూడదనే ఆచారం ప్రకారం తులసిని రామనాథం పుట్టింటికి తీసుకెళ్లాడు. పుట్టింటికి వెళ్లిన వారానికే ఆమె నెల తప్పిందని నిర్ధారణ అయింది.

రామనాథం ఆ శుభవార్తని వియ్యంకుడికి తెలియజేశాడు.

'సంతోషం' అన్నాడుట విశ్వనాథం క్లుప్తంగా.

ఆ విషయం కూతురికి చెప్పి "మరీ టెలిగ్రాఫ్ కోడ్‌లా మాట్లాడతాదేమిటమ్మా మీ మామగారు?" అనహనంగా అడిగేడాయన.

తులసి అదేమీ పట్టించుకునే స్థితిలో లేదు. ఆమె భర్త ఫోన్ కాల్ కోసం ఎదురుచూస్తోంది. రెండు రోజుల తర్వాత అతను ఫోన్ చేశాడు.

"తులసీ! థాంక్యూ! థ్యాంక్ యూ వెరీమచ్!" అన్నాడు. అతని స్వరంలో అవధులు దాటిన ఆనందం.

"దేనికి?" సిగ్గుతెరలని అవతలకి నెడుతూ అడిగింది.

"నన్ను నాన్నని చేస్తున్నందుకు" అతని స్వరంలో చిలిపిదనం. "నీ ఆరోగ్యం జాగ్రత్త. ఉంటాను" అతను ఫోన్ పెట్టేశాడు. ఆ కాస్తకే ఆమె పొంగిపోయింది. స్త్రీ అల్ప సంతోషి కదా!

అల్లుడికి ఆషాఢపట్టీ ఇవ్వాలి కనుక శ్రావణ మాసం రాగానే అతన్ని, తమ ఇంటికి రమ్మని ఫోన్‌లో ఆహ్వానించాడు రామనాథం.

"వీలుచూసుకుని వస్తానండి" అన్నాడు సూర్యం. రెండు రోజుల తర్వాత విశ్వనాథం ఫోన్ చేశాడు.

"రేపు ఉదయం సూర్యం మీ ఇంటికొస్తున్నాడు" అని వియ్యంకుడితో చెప్పాడు.

మరునాడు ఉదయం వచ్చాడు సూర్యనారాయణ. సాయంకాలం నాలుగు గంటలకి తిరుగుప్రయాణమవుతున్న అతన్ని చూసి సందేహిస్తూనే అడిగింది తులసి.


"రాత్రికి ఉండరా?"

అసంతృప్తితో ఆశాభంగంతో ఆమెకి కన్నీళ్లు వచ్చాయి.

తన భర్త ఎంత మంచివాడయినా కానీ అస్వతంత్రుడు, తండ్రి చాటు బిడ్డ అనుకుంటే ఆమె దుఃఖం రెట్టింపయింది.

నా కోసం కాదు.. మా అమ్మనాన్నల సంతోషం కోసమైనా ఈ ఒక్కరాత్రే ఇక్కడ ఉండలేరా, ఆ మాటలు అతని హృదయాన్ని తాకాయి.

"ఉంటాను. నువ్వు బాధపడకు" అన్నాడామె కన్నీళ్లని తుడుస్తూ.




వెంటనే తండ్రికి ఫోన్ చేసి తను ఈ రాత్రికి ఇక్కడ ఉండి మరునాడు ప్రొద్దుటే బయలుదేరి వస్తున్నానని చెప్పాడు.

ఆ రాత్రి ఆలస్యంగా నిద్రపోయిన సూర్యనారాయణ మరునాటి ఉదయం తొమ్మిది గంటల వరకు నిద్ర లేవలేకపోయాడు. స్నానం కానిచ్చి అతను బయలుదేరబోయేసరికి పదిన్నరయింది.

"మీరు భోజనం చేసి వెళ్తారని వంట వండుతున్నాను బాబూ! మరో అరగంటలో అయిపోతుంది. భోంచేసి వెళ్లండి" అంది తులసి తల్లి శ్రీలక్ష్మి.

రాత్రి అత్తవారింట్లో ఉండిపోడానికి తండ్రి ఒప్పుకున్నాడనే ధైర్యం ఆవిడ ప్రతిపాదనని అంగీకరించేలా చేసిందతన్ని.

పదకొండున్నరయింది. భోజనాల సమయం కాకపోయినా అల్లుడు ఊరికి బయలుదేరుతున్నాడని భోజనాలకేర్పాటు చేసిందావిడ. కూతురు అల్లుడితోబాటు భర్తకి కూడా వడ్డించి నేతిగిన్నె చేతుల్లోకి తీసుకుని వడ్డనకి ఉపక్రమించింది శ్రీలక్ష్మి.

"సూర్యం!" వీధిలో నుంచి విశ్వనాథం గొంతు సింహగర్జనలా వినిపించింది.

అన్నం కలిపి నోట్లో ముద్ద పెట్టుకోబోతున్న అతను అదిరిపాటుతో లేచి నిలబడ్డాడు. వాష్ బేసిన్ దగ్గర చెయ్యి కడిగేసుకుని గభాల్న బయటకొచ్చాడు.

గంభీరమైన తండ్రి ముఖం చూసేప్పటికి అతని నోట్లో తడి ఆరిపోయింది.

"బయలుదేరు" శాసిస్తున్నట్టు అన్నాడు విశ్వనాథం.



## తనుశ్రీ అలక

తనుశ్రీ దత్తాకి బాలీవుడ్‌లో బెస్ట్ ఫ్రెండ్ 'కొయినా మిత్రా' ఏం చేస్తే తనుశ్రీ కూడా అలాగే చేస్తుంటుందిట. కొయినా ఈమధ్య తన ముఖకవళికల్లో గ్లామర్ కోసం ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే తనుశ్రీ కూడా అలాగే చేద్దామనుకుని వాళ్ల మమ్మీకి చెప్పిందిట. దీంతో తనుశ్రీ వాళ్ల మమ్మీ 'అంత ఖర్చు ఇప్పుడు మనం పెట్టలేం, అయినా నీ గ్లామర్‌కేం తక్కువ బేబీ' అంటూ తనుశ్రీని నిరుత్సాహపరిచేసరికి ముఖం ముడుచుక్కూర్చుందిట తనుశ్రీ. ప్చ్!

భర్త వెనుకే ఆదుర్దాగా వెన్నంటి వచ్చింది తులసి. ఉన్నట్టుండి వియ్యంకుడెందుకొచ్చాడో సూర్యనారాయణని ఎందుకు బయలుదేరమన్నాడో అర్థం కాని అయోమయంతో రామనాథం, శ్రీలక్ష్మి గుమ్మంలోకొచ్చారు.

“రండి బావగారూ! అందరూ కులాసాయేనా?” నమస్కరిస్తూ అడిగాడు రామథం.

“ఆ...” పొడిగా అన్నాడు విశ్వనాథం.

సూర్యనారాయణ చెప్పులు తొడుక్కున్నాడు.

“వస్తాను” జనాంతికంగా అని ముందుకి కదిలాడు. భోజనం ముందు నుంచి లేవడం మంచిది కాదని భోజనం చేసి వెళ్లమని, వియ్యంకుడిని లోపలకి రమ్మని తమతో బాటు భోజనం చెయ్యమని రామనాథం ఎంత బ్రతిమాలినా ప్రయోజనం లేకపోయింది.

వెనుదిరిగి చూడకుండా సూర్యం తండ్రి వెనుక నడిచాడు.

తులసి కన్నీళ్లు రామనాథం దంపతులకి విశ్వనాథం విశ్వరూపాన్ని విశదీకరించాయి. ఆ తర్వాత అల్లుడిని తమ ఇంటికి రమ్మని ఆహ్వానించడానికే భయపడ్డాడు రామనాథం.

☆ ☆ ☆

కాలచక్రంలో సంవత్సరాలు గతించాయి. అత్తగారు చనిపోయాక ఆ ఇంటి బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్న తులసి పుట్టింటికి వెళ్లడమే అపురూపమయిపోయింది.

సూర్యనారాయణ తొలి సంతానమైన కూతురికి పెళ్లి చేశాడు. రెండవ సంతానమైన కొడుక్కి తండ్రి పేరు పెట్టుకున్నా ఎవరూ ఆ పేరుతో పిలవరు. షార్ట్‌కట్‌లో విషి అని పిలుస్తారు. బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న విషికి పెళ్లి నిశ్చయమైంది.

పెళ్లి వారం రోజులుందనగా ఆ రాత్రి తాతగారు పిలిచారని ఆయన గదిలోకి వెళ్లిన అతను అరగంట తర్వాత ముఖం గంటుపెట్టుకుని తల్లి దగ్గరకొచ్చాడు.

“తాతగారు అలా మాట్లాడతారేమిటమ్మా?”

“ఏమన్నారు?”

“నేను పెళ్లయ్యాక చీటికిమాటికి అత్తవారింటికి వెళ్లకూడదట. బెట్టుగా ఉండాలిట. అత్తారింటికి ఏడాదికోసారి వెళ్తేనే గౌరవంగా చూస్తారుట” క్షణం ఆగి అన్నాడు.

“నా భార్య తల్లిదండ్రులు నా తల్లిదండ్రుల లాంటి వారు కారామ్మా? నేను వాళ్లింటికి వెళ్లకపోతే వాళ్లతో ఫ్రీగా మూవ్ అవ్వకపోతే నా భార్య హర్టవ్వదా?”

తన భర్త తన పుట్టింటికి అతిథిగానే ఎందుకు వచ్చి వెళ్లేవాడో అర్థమయింది తులసికి.

“నువ్వన్నదే కరెక్టు నాన్నా!” అంది కొడుకు సంస్కారాన్ని మనసులోనే అభినందిస్తూ.

“నీ అత్తమామలు నీ తల్లిదండ్రుల లాంటివారే! వాళ్లని గౌరవించు. నీ గౌరవాన్ని నిలబెట్టుకో! నీ భార్య మనసుని కష్టపెట్టకు” అంది.

ఆ రాత్రి తులసికి నిద్రపట్టలేదు. కొడుకు మాటలని మననం చేసుకుంటోంది.

కాలంతో బాటు మనుషులు మారతారంటారు. కానీ మామగారి దృక్పథంతో అప్పటికీ ఇప్పటికీ మార్పు లేదు. అంతే కాదు. భర్తలో కూడా మార్పు లేదు. ఇప్పటికీ అతను తండ్రి చాటు కొడుకే. వేదనగా నిట్టూర్చింది.

☆ ☆ ☆

విషి సూట్‌కేసుతో లోపలకి రావడంతోనే విశ్వనాథం అడిగేడు.

“ఏరా మొన్ననే వస్తానన్నావు. ఇప్పుడా రావడం?”

“మా అత్తగారికి జ్వర తీవ్రత ఎక్కువై హాస్పిటల్‌లో జాయిన్ చేశారు తాతగారూ!”

“అందుకని అక్కడే ఉండిపోయావా? చెప్పిన టైముకి రావాలనే ఇంగితం లేదా? మీ నాన్న ఒకసారి ఇలాగే చేశాడు. అప్పటికి నువ్వు పుట్టలేదు. మీ నాన్న సాయంకాలానికి వస్తానని మీ తాత ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రి అక్కడ ఉండిపోయాడు. మరునాడు పొద్దుటే వస్తానని ఫోన్‌చేసిన వాడు రాలేదు. చెప్పిన టైముకి రాలేదని నాకు కోపం వచ్చి హుటాహుటిన భీమవరం నుంచి రాజమండ్రి వెళ్లాను. మీ తాత ఇంటి గడపలో నిలబడి సూర్య అని ఒక్క గావుకేక పెట్టాను. అన్నం ముందు కూర్చున్నవాడు తినకుండానే లేచి నా వెంట వచ్చేశాడు తెలుసా?”

“ఏదో గొప్ప ఘనకార్యం చేసినట్టు చెబుతున్నారే!” ఈ మాటలన్నది విషి కాదు సూర్యనారాయణ.

విశ్వనాథమే కాదు విషి, తులసి కూడా నోట మాట రానట్టు అతనివైపు చూస్తుండిపోయారు.

“ఆ రోజు నన్ను భోజనం ముందు నుంచి లేపి మీ వెంట తీసుకెళ్లినందుకు ఆ ఇంటిల్లిపాది అభోజనంగా ఉన్న విషయం మీకు తెలుసా? వాళ్ల మనసులు ఎంత గాయపడ్డాయో మీకు అక్కర్లేదు. మీ పంతం పట్టుదల అవే ముఖ్యం మీకు. అల్లుడు చీటికిమాటికి అత్తవారింటికి వెళ్తే గౌరవం ఉండదని ఆ రోజు నాకు చెప్పారు. ఇప్పుడు మీ మనుమడికి చెబుతున్నారు. మీ అర్థం లేని సిద్ధాంతాలతో ఆంక్షలతో నన్ను నా అత్తవారింటికి వెళ్లనియ్యకుండా చేశారు. ఒక మగవాడి చేత తాళి కట్టించుకున్న అమ్మాయి తన వాళ్లందర్నీ వదులుకుని భర్త కుటుంబ సభ్యులని తన వాళ్లుగా భావించాలి. ఆ ఇంటి వాళ్లకి చాకిరీ చెయ్యాలి. కానీ ఒక ఇంటికి అల్లుడైన వ్యక్తి మాత్రం ఆ కుటుంబానికి అతిథిలా వెళ్లాలి తప్ప వాళ్ల కష్టసుఖాలలో పాల్పంచుకోకూడదు. ఇదెక్కడి న్యాయం నాన్నా? మారుతున్న కాలంతో బాటు మారని వ్యక్తి మీరు. మీలో మార్పు రాకపోయినా ఫర్వాలేదు. పాలలాంటి విషి మనసులో విషాన్ని నింపకండి” సుతిమెత్తని కొడుకు స్వరంలో అంతర్లీనంగా ఉన్న పదును చూసి మొదటిసారిగా జంకాడు విశ్వనాథంగారు.

తులసి భర్తని ఆనందాశ్చర్యాలతో చూస్తోంది. అతనిలో ఆలస్యంగానైనా వచ్చిన ఈ మార్పు ఆమెని సంతోషపెట్టింది.

☆

## సరికొత్త టాబు

ఈమధ్య టాబు గ్లామర్ రోజు రోజుకీ పెరిగిపోతోంది అనేది బాలీవుడ్డంతా వినిపిస్తున్న సంగతి. ‘సీజన్స్ గ్రీటింగ్స్’ అనే సినిమా కోసం ఇటీవలే కేప్‌టౌన్ వెళ్లి షూటింగ్ చేసొచ్చింది టాబు. ఈ సినిమా కోసం టాబు హెయిర్ స్టయిల్ మొత్తం మారిపోయిందిట. అంతేకాదు, చూడగానే ఓ సరికొత్త టాబు అందరికీ కనిపిస్తుంది అంటున్నారు ఆ యూనిట్‌వాళ్లు. నలభయ్యవ పడిలోకి అడుగుపెడుతున్న టాబు హేమమాలిని, రేఖల్లా టింగణా అవుతున్న కొద్దీ అందాన్ని పెంచుకుంటోందన్నమాట.

